# రైతుబంధు ఇచ్చే కేసీఆరా..

ఎవరు కావాలో మీరే ఆలోచించుకోండి

# రాబందు కాంగ్రెస్సా..?

- కాంగ్రెస్‌కు ఓటేస్తే రైతు జీవితం ఆగమైతది
- కరెంట్ కాటకలుస్తది.. తెలంగాణ అంధకారమైతది
- అది కొత్త పార్టీ కాదు.. చెత్తపార్టీ
- నమ్మితే మోసపోతరు
- పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్
- వెల్గటూర్‌లో ధర్మపురి అభ్యర్థికి మద్దతుగా రోడ్‌షో



వెల్గటూర్‌లో బీఆర్ఎస్ పాటకు నృత్యం చేస్తున్న మంత్రులు కేటీఆర్, కొప్పుల ఈశ్వర్

వెల్గటూర్, నవంబర్27: 'మీకు రైతు బంధు ఇచ్చి కంటికి రెప్పలా కాపాడుకునే బీఆర్ఎస్ కావాలా..? రాబంధుల్లా అన్నీ తన్నుకుపోయి, తీసేసి వేధించే కాంగ్రెస్ కావాలా..? రైతులే తేల్చుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. సోమవారం వెల్గటూర్ మండల కేంద్రంలో ధర్మపురి అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా రోడ్‌షో ద్వారా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడారు. మొదట మహిళలకు కార్తీక పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. కరెంటు గురించి మాట్లేండేందుకు కాంగ్రెస్ నేతలకు సిగ్గుండాలన్నారు. రైతులకు 3గంటల కరెంటు కావాలని రేవంత్‌రెడ్డి అంటున్నాడని, వ్యవసాయానికి రైతులు ఏ మోటార్ వాడాలో కూడా తెలియని సన్నాసి రేవంత్ అని మండిపడ్డారు. 24 గంటల కరెంట్ ఇచ్చే బీఆర్ఎస్ కావాలా..? మూడు గంటలు ఇచ్చే కాంగ్రెస్ కావాలా..? ప్రజలే తేల్చుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ఒక్క చాన్స్ అంటూ వస్తున్నదని, వాళ్లకు ఒక్కటి కాదు ఇప్పటివరకు 11 సార్లు అవకాశం ఇచ్చామని, 55 ఏండ్లు పాలించి ఏం చేసిందో చెప్పాలన్నారు. కనీసం ప్రజలకు తాగునీరు కూడా ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ కొత్త పార్టీ కాదని, చెత్త పార్టీ అని, కాంగ్రెస్‌కు ఓటేస్తే రైతుబంధు తీసేస్తారని, కరెంటు కాటకలుస్తుందన్నారు. రైతు బంధు కొత్త పథకం కాదని, ఇప్పటిదాకా 11సార్లు వేశామని, ఈ సారి డబ్బులు జమ చేసేందుకు ఎలక్షన్ కమిషన్ అనుమతి ఇస్తే ఈ కాంగ్రెస్ నాయకులు పోయి కంప్లెయింట్ చేసి నిలిపివేయించారని మండిపడ్డారు. రైతుబంధుపై కాంగ్రెస్ వక్రబుద్ధి బయట పడిందన్నారు. మన ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రైతు బంధు డబ్బులు ఖాతాల్లో జమచేస్తామన్నారు. కాంగ్రెస్ ఉంటే కరెంటు ఉండదని, ధరణిని రద్దు చేసి పట్వారీ వ్యవస్థను మళ్లీ తెస్తామని కాంగ్రెస్ నేతలు బహిరంగంగానే చెబుతున్నారని, మళ్లీ ఆ దరిద్రపు పాలన మనకు అవసరమా..? చెప్పాలని ప్రశ్నించారు. 2014 ఎన్నికల టైంలో సిలిండర్ ధర ప్రజలకు భారమైపోతున్నదని చెబుతూ ఓటు వేసేముందు సిలిండర్‌కు మొక్కి ఓటువేయాలని ఆనాడు మోడీ మాట్లాడారని గుర్తు చేశారు. అయితే ఆయన గెలిచిన తర్వాత రూ.400ధర ఉన్న సిలిండర్ ధరను ఏకంగా రూ.1200కు పెంచాడన్నారు. కేసీఆర్ ప్రభుత్వం మూడోసారి గెలవగానే సిలిండర్‌ను రూ.400కే సిలిండర్ అందజేస్తామన్నారు. కాంగ్రెస్ నాయకులు మార్పు కావాలని మాట్లాడుతున్నారని, ఏం మార్పు కావాలి..? మూడు నెలలకోసారి ముఖ్యమంత్రుల మార్పా..? రూ.2000 పెన్షన్ రూ.200కు మార్పా..? 24 గంటల కరెంట్ 3 గంటలకు తగ్గింపా..? అని ఎద్దేవా చేశారు. మాట్లాడితే చాలు సీఎం కేసీఆర్ మార్చాలని మాట్లాడుతున్నారని, వాళ్లేమో నెహ్రూ నుంచి రాహుల్ వరకు రాజ్యమేలవచ్చుగానీ, తెలంగాణ సాధించిన కేసీఆర్ రెండుసార్లు సీఎంగా ఉంటే జడిసిపోతున్నారని ఎద్దేవా చేశారు. ధర్మపురిలో ఈశ్వరన్న మీద నాలుగు సార్లు ఓడిపోయిన వ్యక్తి, ఈసారి అతన్ని గెలిపించకపోతే చచ్చిపోతానని ప్రజలను బ్లాక్ మెయిల్ చేసేలా మాట్లాడడం సరి కాదన్నారు. అలాంటి సెంటిమెంట్ మాటలకు మీరు జాలిపడితే వచ్చే ఐదేండ్లు మీరు బాధపడాల్సి ఉంటుందన్నారు. స్తంభంపల్లిలో ఇథనాల్ ప్రాజెక్టును రద్దు చేసి దాని స్థానంలో వ్యవసాయ కళాశాలను తెచ్చుకున్నన్నామని, ఐటీఐ, పాలిటెక్నిక్ కాళేజీ, ఫిస్ ప్రాసెస్ యునిట్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ముండ్ల చెట్టును నాటి పండ్లు రావాలంటే రావని, ఈ ఎన్నికల్లో ఈశ్వర్ లాంటి మంచి వ్యక్తులకు ఓటు వేసి గెలిపించుకుంటే అభివృద్ధి జరుగుతుందని వివరించారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే 50 ఏండ్లు వెనక్కిపోతామని, కారు గుర్తు కు ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. రాష్ట్రానికి సీఎం కేసీఆర్ రక్ష అయితే, ధర్మపురి నియోజకవర్గానికి ఈశ్వర్ రక్ష అని చెప్పడంతో సభలో ఉన్న వారంతా కేరింతలు కొట్టారు. ఇక్కడ పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఎంపీపీ కునమల్ల లక్ష్మి, జడ్పీటీసీ బొడ్డు సుధారాణి, ఏఎంసీ చైర్మన్ వెంకటేశ్, నాయకులు బాదినేని రాజేందర్,చల్లూరి రాంచందర్‌గౌడ్, సింహాచలం జగన్ పాల్గొన్నారు.



వెల్గటూర్ రోడ్‌షోలో మాట్లాడుతున్న కేటీఆర్ చిత్రంలో కొప్పుల ఈశ్వర్, ఎంపీ వెంకటేశ్‌నేత కాని

### కాంగ్రెస్ వచ్చేది లేదు.. సచ్చేది లేదు..



కేటీఆర్‌కు మొక్కను అందజేస్తున్న కొప్పుల

కేసీఆర్ దమ్మున్న నాయకుడు. తెలంగాణను సాధించి, సీఎంగా ఆయన నాయకత్వంలో తొమ్మిదేండ్లలోనే రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపారు. ఆయన సహకారంతో నేను కూడా ధర్మపురి నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశా. ఈ రోజు జరుగుతున్న ఎన్నికలు కేవలం వ్యక్తుల కోసం జరుగుతున్నవికావు. ఐదేండ్ల మన భవిష్యత్, అభివృద్ధిని నిర్ణయించే ఎన్నికలు. ఈ క్రమంలో ప్రజలంతా మంచి, చెడులు ఆలోచించి ఓటు వేయాలి. గతంలో ఈ ప్రాంతం ఎలా ఉం డె..? కరెంట్, తాగు, సాగు నీరులేక అరిగోస పడ్డం. ఇప్పుడెలా ఉంది..? ఎంతలా అభివృద్ధి చెందిందో ఒకసారి ఆలోచించాలి. ఈ అభివృద్ధి ఇలానే కొనసాగాలంటే ఈ నెల 30 న కారు గుర్తుకు ఓటేసి మన ముఖ్యమంత్రి కేసీఆర్‌ను గెలిపించాలి. కాంగ్రెస్ వచ్చేది లేదు.. సచ్చేది లేదు. నమ్మితే మోసపోతరు.

**- కొప్పుల ఈశ్వర్, ధర్మపురి బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి**

# దుష్ప్రచారాన్ని నమ్మద్దు



- బీజేపీ అభ్యర్థికి ఓటమి భయంతోనే నాపై ఫేక్ ప్రచారం
- కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టే కుట్ర
- ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

మారుతీనగర్, నవంబర్ 27: ఓటమి భయంతోనే బీజేపీ అభ్యర్థి అర్వింద్ తనపై దుష్ప్రచారం చేస్తున్నాడని, కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతూ, ప్రజలను రెచ్చగొడుతున్నారని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు పేర్కొన్నారు. సోమవారం మెట్‌పల్లి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 25 ఏండ్ల తన రాజకీయ జీవితంలో ప్రజాసేవే లక్ష్యంగా పని చేశానని, తనపై అసత్య ఆరోపణలో సోషల్ మీడియాలో వైరల్ చేయించడం సరికాదని బీజేపీ అభ్యర్థికి హితవు పలికారు. ప్రశాంతంగా ఉన్న కోరుట్ల నియోజకవర్గంలో కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టి కల్లోలం సృష్టించడానికే బీజేపీ అభ్యర్థి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. గంగపుత్రులు, ముదిరాజ్ సంఘ సభ్యులను తన కుటుంబ సభ్యులుగానే భావించానన్నారు. కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయ లబ్ధిపొందాలని చూస్తున్న వారిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. నియోజకవర్గంలోని అన్ని కులాల భాగస్వామ్యంతోనే తనను పలుమార్లు ఎమ్మెల్యేగా గెలిపించుకున్నారని, తనపై వస్తున్న వదంతులను నమ్మద్దని కుల సంఘాల సభ్యులను కోరారు. 15 ఏండ్లుగా కోరుట్ల నియోజకవర్గంలో న్యాయపరిపాలన జరిగిందని, శాంతియుతంగా ఉన్న నియోజకవర్గంలో అశాంతి నింపడానికి గొడవలను సృష్టించేందుకు వచ్చి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను నోటి కచ్చినట్లు మాట్లాడడం ప్రజలు గమనించాలన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవ చేయడానికి వస్తున్న తన కొడుకు బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్లను కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రావు, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు మార్గం గంగాధర్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుల రాణవేని సత్యనారాయణ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతు బంధును ఆపింది బీజేపీ, కాంగ్రెస్సే

- రాజకీయాల కోసం రైతులను ఇబ్బంది పెడుతున్నరు
- ఆచరణ సాధ్యంకాని హామీలతో ప్రజలను మోసం చేస్తున్నరు
- సోషల్ మీడియాలో దుష్ప్రచారాలను నమ్మద్దు
- బీఆర్ఎస్‌తోనే మత్స్యకారుల ఆర్థికాభివృద్ధి
- కోరుట్ల అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల



మెట్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

మారుతీనగర్, నవంబర్ 27: రైతుల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అండగా నిలుస్తుంటే, బీజేపీ, కాంగ్రెస్‌లు రైతు బంధు పంపిణీ నిలిపి వేయించి సంబురపడుతున్నాయని కోరుట్ల అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల మండిపడ్డారు. రైతుల సంక్షేమానికి అడ్డుతగులుతున్న ఆ రెండు పార్టీలకు ఈ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. సోమవారం మెట్‌పల్లి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందనే భయంతోనే జాతీయ పార్టీలు రైతు బంధు నిలిపివేసి ఆర్థికంగా రైతులను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలోని పలు అంశాల గురించి పలువురు ప్రజలు కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని వివరణ కోరితే పథకాలు అమలు సాధ్యాఅసాధ్యాల గురించి గెలిచాక చూద్దామనడంతోనే అది మోసపూరితమైన మెనిఫెస్టో అని తెలిపోయిందన్నారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ కింద రైతులకు ఖాతాల్లో డబ్బులను జమచేయవచ్చు కానీ రైతు బంధు సాయం ఎందుకు ఇవ్వద్దో చెప్పాలని ప్రశ్నించారు. రైతు బంధు ఆపడంతో జాతీయ పార్టీల వక్రబుద్ధి ఎక్కడ బయటపడుతుందోనని బీఆర్ఎస్ నాయకులపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మోటర్లకు మీటర్లను ఫిట్ చేస్తేనే రాష్ట్రానికి నిధులు ఇస్తామని చెప్పినా, రైతుల శ్రేయస్సు కోసం సీఎం కేసీఆర్ ఒప్పుకోలేదని, అంతటి గొప్ప వ్యక్తి మన ముఖ్యమంత్రి అని కీర్తించారు. కాంగ్రెస్ పాలనలో సాగునీరు, కరెంటు, యూరియా, విత్తనాలు సకాలంలో అందక ఎందరో రైతులు ఆత్మహత్యలు చేసుకున్న సంఘటలున్నాయని, కేసీఆర్ పాలనలో అలాంటి పరిస్థితులు ఉన్నాయా..? ఒకసారి రైతులు ఆలోచించాలన్నారు. రాష్ట్రంలో పుష్కలంగా నీరు, విద్యుత్‌తో పాటు మౌళిక వసతులుండడంతో పరిశ్రమలు, ఐటీ కంపెనీలు పెద్ద సంఖ్యలో వస్తున్నాయని, యువతకు ఉపాధి, ఉద్యోగఅవకాశాలు పెరుగుతున్నాయన్నారు. గత పాలనలో మత్సకారులను పట్టించుకున్న ప్రభుత్వాలున్నాయా..? అని ప్రశ్నించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాతనే మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక శాఖను ఏర్పాటు చేసి, నిధులు మంజూరు చేసి అండగా నిలిచిందన్నారు. ఒకప్పుడు మన రాష్ట్ర అవసరాల కోసం ఆంధ్ర, రాయలసీమ నుంచి చేపలను దిగుమతి చేసుకునే పరిస్థితి ఉండేదని, కానీ స్వరాష్ట్రంలో కేసీఆర్ చేపట్టిన చర్యలతో మత్స్య సంపద పెరిగి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదిగామని వివరించారు. మత్సకారులను బీఆర్ఎస్ నాయకులు ఏనాడూ ఒక్క మాట అనలేదని, ప్రతిపక్ష నాయకులు కావాలనే దుష్ప్రచారం చేస్తూ కులాల మధ్య చిచ్చు పెడుతున్నారని మండిపడ్డారు. నిరంతరం మీ వెంటే ఉండి సేవ చేసున్న తనను గెలిపించాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రావు, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు మార్గం గంగాధర్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుల రాణవేని సత్యనారాయణ ఉన్నారు.